చాపరాయిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పర్యాటకుల తాకిడితో జలపాతం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో సుమారు కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చాపరాయి జలపాతంలో సరదాగా స్నానాలు చేసి, థింసా నృత్యాలు ప్రదర్శిస్తూ ఆనందంగా గడిపారు. జలపాతంలోని ఉద్యానవనంలో ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. రోడ్డుకిరు వైపులానున్న వలిసే పూల తోటలు, పొద్దు తిరుగుడు పూల తోటల్లో కూడా ఫోటోలు తీసుకుంటూ సరదాగా గడిపారు. చెట్ల నీడల్లో పర్యాటకులు వంటకాలు చేసుకుని వనభోజనాలు చేసి కుటుంబ సమేతంగా ఆటపాటలతో డ్యాన్సులు చేస్తూ ఆనందంగా గడిపారు. ఆంజోడ సిల్క్ పారంలోని అరకు పినరీ వ్యూ పాయింట్ వద్ద సందడి చేశారు.

స్నానాలు చేస్తున్న పర్యాటకులు

అడవి మార్గంలో కూర్చున్న విద్యార్థులు

పాఠశాలకు వెళ్లాలంటే..

అడవిని దాటాల్సిందే!

- రోడ్డు లేక అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని రాప్ప పంచాయతీ మారుమూల అడవి ప్రాంతాల్లో విద్యార్థుల విద్యాభ్యాసం కోసం అవస్థలు పడుతున్నారు. చదువుకునేందుకు రీడబంద నుంచి కోటగుమ్మ వరకు అడవి మార్గాన నడిచి వెళ్లాల్సి వస్తోంది. ప్రతి ఉదయం చదువు కోసం బయలుదేరే చిన్నారులు అడవి దారుల గుండా, మట్టి రోడ్లలో, రాళ్ల గుట్టల్లో నడుస్తూ పాఠశాలకు చేరుకుంటున్నారు.హుకుంపేట మండలం రీడబంద గ్రామం సమీపంలోని కోటగుమంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు రహదారి లేనందున విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరం కాలిబాటనే వెళుతున్నారు. ఎండలోనూ, వర్షంలోనూ, మట్టి దారులలో వెళుతూ ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు పాఠశాలకు వెళ్లే మార్గమధ్యంలో అవస్థలు పడుతూ ఆగి ఆగి వెళుతున్నారు. అడవి చెట్ల నీడలో కూర్చుంటున్నారు. తక్షణమే రహదారి సదుపాయం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, పలు ప్రజా సంఘాల నాయకులు, కోరుతున్నారు.

తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో గసభ పంచాయతీ గరిడేలులో గ్రావిటీ ద్వారా నిర్మించిన తాగు నీటి పథకాన్ని సిపిఎం సర్పంచ్ పి.సునీత చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ 4లక్షల యాభై వేలు కేటాయించి నిర్మాణం చేసినట్లు చెప్పారు. పైపులైన్లు, వాటర్ ట్యాంక్, కుళాయిలు నిర్మాణం చేశామని చెప్పారు. తాగు నీరు లేక ఎంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని పరిశీలించి నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రోడ్డు, కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం కూడా చొరవ చూపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, వార్డ్ మెంబర్స్ సత్యనారాయణ, గోపాల్, పాంగి. రాజ్ కుమార్, ఆనందరావు, పీసా కార్యదర్శి, ఉపాధ్యక్షులు ఎం రామన్న, పద్దు బాస్కరరావు, కొత్తు, క్రిష్ణ మూర్తి, నీటి కమిటి సంఘం కార్యదర్శి ముకుంద్, మొద్నో, సిపిఎం నాయకులు దొరబాబు, సుబ్బారావు, దర్మారావు, సింహాద్రి, రామారావు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీత

మండల పరిషత్ కార్యాలయంలో

మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కరువు

- తీవ్ర ఇబ్బంది పడుతున్న మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-చింతపల్లి:మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మరుగుదొడ్లు అత్యంత దయనీయంగా ఉన్నాయి. నీటి సదుపాయం పూర్తిగా లేకపోవడంతో మరుగుదొడ్లు వినియోగించలేని పరిస్థితి నెలకొంది. సమావేశాలకు హాజరయ్యే మహిళా ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కాలకృత్యాల కోసం బహిరంగ ప్రదేశాలను ఆశ్రయించాల్సి వస్తుండటంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

2022లో వైసిపి ప్రభుత్వ కాలంలో పంచాయతీరాజ్ నిధుల ద్వారా సుమారు రూ.14 లక్షల వ్యయంతో సమావేశ మందిరాన్ని సుందరీకరించారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సౌకర్యార్థం ప్రత్యేక మరుగుదొడ్లను కూడా నిర్మించారు. అయితే నీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. నీరు లేకపోవడం, నిర్వహణ లోపం, శుభ్రతపై దృష్టి పెట్టకపోవడం వల్ల అవి పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయి. మరుగుదొడ్లు ఉన్నా నీళ్లు లేక లోపలికి వెళ్లే పరిస్థితే లేకపోతుందని మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్ల ఫ్లోర్ దెబ్బతినడం, నీటి సౌకర్యం లేమితో శుభ్రపరిచే అవకాశం లేకపోవడం వల్ల దుర్వాసన తీవ్రంగా వ్యాపిస్తోంది. సమావేశాల సమయంలో పాల్గొనే ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు అసౌకర్యం అనుభవిస్తున్నారు.

మండల పరిషత్తులో దుస్థితిపై ప్రజల అసంతృప్తి

మండల స్థాయిలో కీలక సమావేశాలు జరిగే భవనంలో కనీస మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ భవనం ఇలా ఉంటే గ్రామాలలో పరిస్థితి ఎలా ఉంటుందో? అని వారు ప్రశ్నిస్తున్నారు. మరుగుదొడ్లలో నీటి సదుపాయం కల్పించి, శుభ్రత పనులు, ఫ్లోర్ మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని వారు పేర్కొంటున్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్డి బేసిన్

నీరు లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

పెంచలయ్య హత్య కారకులను శిక్షించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-విఆర్ పురం: నెల్లూరులో ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య హత్యను ఖండిస్తూ మండలంలోని రేఖపల్లి కేంద్రంలో విఆర్.పురం మండల సిపిఎంకమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ 28న నెల్లూరుపట్నంలో ప్రజా కళాకారుడు, నెల్లూరు రూరల్ కార్యదర్శి కె.పెంచలయ్యను పట్టపగలే గంజాయి మాఫియా అతి దారుణంగా కత్తులతో దాడి చేసి మట్టుబెట్టడాన్ని ప్రజానాట్యమండలి వి ఆర్ పురం కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు., కళా రూపాలతో ప్రజలను చైతన్యం చేస్తూ, సంఘవిద్రోహ శక్తులకు ఎదురొడ్డి నిలబడి పోరాడి ప్రాణాలర్పించిన పెంచలయ్య మరణం ప్రజా నాట్య మండలికి తీరని లోటని, ఇటువంటి హత్యలు చేస్తున్న సంఘవిద్రోహశక్తులను కట్టడి చేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని మండిపడ్డారు.

ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని పెంచలయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని . డిమాండ్ చేశారు .కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, మండల నాయకులు పూనం ప్రదీప్ కుమార్, సిరప్ తాతబాబు, గొంది దారయ్య, సిపిఎం రేఖపల్లి శాఖ సెక్రటరీ వేటగాని సూరిబాబు, ప్రజానాట్యమండలి జిల్లా సభ్యులు సిహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

మావోయిస్టుల బంద్ ప్రశాంతం

ఊపిరి పీల్చుకున్న మన్య ప్రాంత గిరిజనం

కొయ్యూరులో స్థానికులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -సీలేరు: ఎన్‌కౌంటర్లకు నిరసనగా మావోయిస్టులు పిలుపునిచ్చిన భారత్ బంద్ ప్రశాంతంగా ముగియడంతో మన్యవాసులు ఊపిరిపీల్చుకున్నారు. మావోయిస్టుల బంద్ పిలుపునివ్వడంతో సరిహద్దులో పోలీసులు అప్రమత్తమై గాలింపు చర్యలు ముమ్మరం చేయడంతోపాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అస్కారం లేకుండా సరిహద్దు ప్రాంతంలో పోలీసు బలగాలు మోహరించి కూంబింగ్ ముమ్మరం చేశారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు అటవీ ప్రాంతానికి మావోయిస్టులు తరలివచ్చి సేఫ్టీ జోన్‌లో విధ్వంసానికి పాల్పడవచ్చునని ఇంటెలిజెన్సీ వర్గాలు హెచ్చరికలతో పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టారు. మరోపక్క మావోయిస్టు ఇన్‌ఫార్మర్లపై నిఘా పెట్టారు. శని ఆదివారాల్లో ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా పరిధి పప్పులూరు, కురమనూరు, కప్పుతొట్టి, అల్లూరుకోట, తదితర గ్రామాల్లో పోలీసులు గాలింపు చర్యలు, భద్రత కట్టుదిట్టం చేశారు.కొన్నాళ్లుగా నిశ్శబ్దంగా ఉన్న ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం ప్రశాంతంగా ఉండగా, ఇటీవల వరుస ఘటనలతో వందల సంఖ్యలో సాయుధ పోలీసు బలగాలు ఎఒబిలో మోహరించి గాలింపు చర్యలు చేపడుతుండడంతో మన్యవాసుల్లో మళ్లీ గుబులు పట్టుకుంది.

కొయ్యూరులో ముమ్మర తనిఖీలు

కొయ్యూరు : మావోయిస్టుల భారత్ బంద్ పిలుపు నేపథ్యంలో కొయ్యూరు, మంప పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనకు ఆస్కారం లేకుండా మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో గస్తీ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టిపెట్టి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ విద్రోహ శక్తులకు సహకరించరాదని, అనుమానిత, కొత్త వ్యక్తులపై అప్రమత్తంగా ఉండడంతోపాటు వారికి సంబంధించిన సమాచారాన్ని అందించి సహకరించాలని కోరారు. మారుమూల గ్రామాల గిరిజనులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బైకిస్టులు, ఇతర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని లైసెన్సులు, పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

పెండింగ్ ఆర్ఆర్ ప్యాకేజీ వచ్చేనా?

మరణించిన లబ్ధిదారుల వారసులకు చెల్లింపుపై సందిగ్ధత

కార్యాలయాల చుట్టూ బాధిత కుటుంబీకుల ప్రదక్షిణలు

ప్రజాశక్తి-విఆర్ పురం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పెండింగ్ ఆర్ఆర్ ప్యాకేజీలు చెల్లింపుపై లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. ఆర్ఆర్ ప్యాకేజీ విడుదలైన కొందరు అనారోగ్య కారణాలతో మరణించగా, దాన్ని వారి వారసులకు చెల్లింపుపై సందిగ్ధత ఉంది. మొదటి కాంటూరు పరిధిలోని శ్రీరామగిరి, సీ తంపేట కొత్తూరు కల్తునూరు చొక్కనపల్లి జీడిగుప్పకొండెపూడి కోటూరు గొమ్ము, ఇప్పూరూ, కొల్లూరు పోచవరం ములకపల్లి తదితర గ్రామాల్లో ఇళ్ల సర్వేలు పూర్తయి, అప్పట్లో ఇళ్ల ప్యాకేజీ అందుకోగా, చివరిగా అర్అండ్ఆర్ ప్యాకేజీ ఇంకా రెండు మూడు నెలల్లో వస్తుందన్న సమయంలో పలువురు లబ్ధి దారులు అనారోగ్య కారణాలతో ఎరణించారు. వారి ప్యాకేజీ పెండింగ్‌లో ఉంచిన అధికార యంత్రాంగం, సంబంధిత లబ్ధిదారుల కుటుంబ సభ్యులు అన్ని డాక్యుమెంట్స్, ఇతర ఆధారాలను సంబంధిత రెవెన్యూ శాఖ కార్యాలయంలో సమర్పించినా నేటికీ చెల్లింపులపై స్పష్టత ఇవ్వడం లేదని బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. ఇద్దరు ఉండి అట్టి కుటుంబంలో కుటుంబ జమాని చనిపోతే అతని భార్యకు ఇచ్చారు. మరి ఆ కుటుంబంలో భార్య లేకుండా భర్త ఒక్కడే ఉంటే ఆ భర్త కూడా అనారోగ్య కారణంతో చనిపోతే అట్టి వారికి మాత్రం అర్ఆర్ ప్యాకేజీ ఇవ్వ లేదన్నారు. వారసులైన తమనకు ఆర్ఆర్ ప్యాకేజీ వస్తాయని ఆశతో ఆ కుటుంబ సభ్యులు కార్యాలయాల చుట్టూ తిరిగి ఎఫ్ఎంసి, లీగల్ హెయిర్ సర్టిఫికెట్ కుటుంబసభ్యుల వివరాలతో అన్ని పత్రాలను కార్యాలయంలో సమర్పించినా నేటికీ చెల్లింపులు చేపట్టడం లేదంటున్నారు. మొదటి కాంటూరులో ఉన్న గ్రామాల్లో 10 మందికి పైగా పోలవరం నిర్వాసిత కుటుంబాలలో మృతి చెందిన ఆర్ఆర్ ప్యాకేజీ లబ్ధిదారుల ప్యాకేజీని వారి వారసులకు చెల్లింపులపై ఇప్పటికైనా అధికారులు స్పష్టతనిచ్చి చెల్లింపులు జరపాలని బాధిత కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మోతుగూడెం :ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4 వరకు విశాఖలో జరుగనున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు చింత రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం వై.రామవరం మండలం డొంకరాయి గ్రామంలో సిఐటియు అఖిల భారత మహాసభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. లేబర్ కోడ్స్‌తో కార్మికుల పొట్టగొట్టాలని చూస్తున్నారన్నారు. కార్పొరేట్లకు ప్రయోజనాలు చేకూరుస్తూ, కార్మికులను శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. యజమానులకు కట్టు బానిసలుగా కార్మికులను మారుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. దేశ సంపదను దోచిపెడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు విశాఖలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభ వేదిక కానుందన్నారు. కార్యక్రమంలో నూక రత్నం, ముక్త, నాగమణి, డేవిడ్, సరస్వతి, మాధవ, సన్మతి, లైకాన్, సుబ్బలక్ష్మి, సన్యాసమ్మ, రోజా, మిత్ర పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్, తదితరులు

130 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమహేంద్రవరంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక సిరిగిందలపాడు గ్రామంలో రామకృష్ణ మిషన్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు..శిబిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ పోతుల రామారావు, డాక్టర్ దాసరి ఉమామహేష్ పాల్గొని 130 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు. అవసరమైన రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు ఇన్‌ఛార్జ్ స్వామి లోకమయానంద సూచించారు. శిబిరంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్యసేవల సమన్వయకర్త కానుమొను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్దఅప్పారావు పాల్గొన్నారు. రోగులకు, వారి సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

5 నుంచి జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 5 నుంచి 15 వరకు విశాఖపట్నంలో 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ నిర్వహణకు ఏర్పాట్లు సాగుతున్నాయి. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా దీని బాధ్యతలు చూస్తోంది. ఈ విషయాన్ని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జాన్ గ్యాలియట్ మీడియాకు తెలిపారు. ఈ క్రమంలోనే నగరంలో ఈ పోటీలను నిర్వహించడానికి ఎంపిక చేసిన ప్రదేశాలను ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి గ్యాలియట్, శాప్ అబ్జర్వర్, స్కేటింగ్ కోచ్ పి.థామస్ పరిశీలించారు. విఎంఆర్‌డిఎ పార్కు (ఉడా పార్కు), శివాజీ పార్కు, కైలాసగిరి, బోయపాలెం ప్రాంతాలలో ఈ పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. స్పీడ్, రోలర్ హాకీ, రోలర్ ఇన్ లైన్ హాకీ, రోలర్ స్టేట్ బోర్డ్, రోలర్ ఫ్రీ స్టైల్, ఇన్ లైన్ ఫ్రీ స్టైల్ అండ్ స్కూటర్ వంటి పోటీలను నిర్వహిస్తామని చెప్పారు.

విశాఖలో 100 రోబోటిక్ ఆంకాలజీ సర్జరీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని మెడికవర్ హాస్పిటల్స్ అత్యంత క్లిష్టమైన 100 రోబోటిక్ క్యాన్సర్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసినట్టు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన, అధిక కచ్చితత్వంతో కూడిన కేన్సర్ సంరక్షణను స్థానికంగా అందించడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని చీఫ్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ వి.కార్తీక్ చంద్ర తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం వెంకోజిపాలెం మెడికవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పలు వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు గడిచిన ఏడాదిలో 396 రోబోటిక్ సర్జరీలు జరిగాయని, అందులో 100 రోబోటిక్ ఆంకో సర్జరీలు చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో యూరాలజిస్ట్ డాక్టర్ చోడిశెట్టి సుబ్బారావు, మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ కిరణ్మయి గొట్టపు, డాక్టర్ కార్తీక్ చంద్ర, డాక్టర్ స్వర్ణ, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ పరిమళ

విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ

- గిరిజన సంక్షేమ వసతి గృహాల డిడి పరిమళ

ప్రజాశక్తి - హుకుంపేట: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాల 1 ను జిల్లా డిప్యూటీ డైరెక్టర్ (డిడి) పరిమళ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న వసతి, భోజనం, విద్యా ప్రమాణాలు, పరిశుభ్రత తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సాయంత్రం భోజనం (డిన్నర్) తయారీ విధానం, స్టడీ అవర్ నిర్వహణ, క్లీనింగ్, రికార్డులు, స్టాక్ రూమ్, నైట్ ఆక్ టీ విధులు తదితరాలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి వారి చదువుపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా డిడి పరిమళ మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మెనూ ప్రకారం భోజనం తప్పనిసరిగా సక్రమంగా అమలవ్వాలన్నారు. పరిశుభ్రమైన, పోషక విలువలున్న ఆహారం మాత్రమే అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. వర్కర్లు విధులను మరింత బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి, వార్డెన్ జ్యోతి కుమారి పాల్గొన్నారు.

కంచాలు ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

విజ్ఞాన భారతి హాస్టల్ విద్యార్థులకు వితరణ

ప్రజాశక్తి- పాడేరు: మండలంలోని వంతాడపల్లిలో విజ్ఞాన భారతి హైస్కూల్ హాస్టల్‌లో ఆదివారం విడివి చారిటబుల్ ట్రస్ట్ (విశాఖపట్నం) ఆధ్వర్యాన పిల్లలకు అల్పాహారం, భోజనం వసతి కల్పించారు. విద్యార్థులు ఆడుకునేందుకు సుమారు 5వేల రూపాయల విలువైన క్రీడా సామాగ్రిని కూడా పంపిణీ చేశారు. పిల్లల భోజనం చేయడానికి కంచాలు, స్టీల్ గ్లాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వంటాడపల్లి మాజీ సర్పంచ్ బాలరాజు, ఎంపీపీ నాగరాజు, వార్డెన్ ఆచారి పాల్గొన్నారు.

సింహాచలంలో ఆర్జిత సేవలు రద్దు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 30 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు శ్రీ తిరుమంగై యాళ్వార్ తిరు నక్షత్ర మహోత్సవం సందర్భంగా, భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, దేవస్థానంలో పలు ఆర్జిత సేవలు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. సహస్రం, స్వర్ణ పుష్ప/తులసీ అర్చనం, గరుడసేవ, నిత్య కల్యాణం సేవలు అందుబాటులో ఉండవని, భక్తులు గమనించాలని కోరారు.

ముందుకు సాగని.. రోడ్డు, వంతెన పనులు

రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి పంచాయతీ పరిధి రింగ్ రోడ్డు, వంతెన పనులు నిలిచి పోయాయి. దీంతో, రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతగిరి పెద్దూరు నుండి మాలింగవలస, పాతకోట మీదుగా రేగం, నందిగుమ్మి, నిమ్మలపాడు మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న రింగ్ రోడ్డు పనులు ఏళ్ల తరబడి నిలిచిపోయాయి. దీంతో రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న 8 గిరిజన గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి నిత్యం ఇదే మార్గాన రాకపోకలు సాగిస్తున్నారు. పెద్దూరు, మాలింగవలస మార్గమధ్యలో వంతెన గత ఏడాది కాలం నుండి తాత్కాలికంగా పనులు నిలిచి పోయాయి. రోడ్డు పొడవున వేసిన మెటల్ తుఫాన్ కారణంగా కోతకు గురై గోతులు ఏర్పడింది. పాతకోట గ్రామంలో ఏకలవ్య పాఠశాల పనులు జరుగుతున్నాయి. దీంతో మార్గాన్ని గృహ నిర్మాణ సామాగ్రి తరలిస్తున్నారు. ఇప్పటికైనా బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు.

నిలిచిన వంతెన పనులు

డీలర్ల అక్రమ నియామకాలపై విచారించాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధనుంజయ్

మాట్లాడుతున్న ధనుంజయ్

ప్రజాశక్తి- చింతపల్లి: చింతపల్లి మండలంలో జిసిసి డిపోలలో డీలర్లను అక్రమంగా నియమించిన చింతపల్లి జిసిసి డీఎం వెంకటేశ్వర్లును వెంటనే సస్పెండ్ చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, పౌరసరఫరాల శాఖ అనుమతి, ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ లేకుండా ఎలా నియామకాలు చేపడతారని ప్రశ్నించారు. ఇలాంటి నియామకాలు జరగాలంటే జిల్లా కలెక్టర్ ఆదేశాలు, గెజిట్ ఉత్తర్వులు తప్పనిసరిగా ఉండాలని, అలాగే నోటిఫికేషన్ ద్వారా స్థానిక అర్హులైన నిరుద్యోగ యువత లేదా డ్వాక్రా సంఘాలకు అవకాశమివ్వాలనే నిబంధనలు స్పష్టంగా పేర్కొన్నా వాటిని పక్కన పెట్టి ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులను ఎలా డీలర్లుగా నియమించారంటూ ధనంజయ్ నిలదీశారు. సంవత్సరం క్రితం నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన 29 మంది డీలర్లకు ఇప్పటికీ ఆర్డర్ కాపీలు ఇవ్వకుండా ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. ఇప్పటికే అర్హత పొందిన వారికి తక్షణమే ఆర్డర్లను జారీ చేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుభవం కలిగిన స్థానిక నిరుద్యోగులు, డ్వాక్రా సంఘాలను పక్కన పెట్టడం సమంజసం కాదన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి విచారణ కమిటీ నియమించి, అక్రమ నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత గొల్లోరి శ్యాంసుందర్, నేమవరపు భరత్ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రిన్సిపల్ చలపతిరావు

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ లోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు అన్నారు. కళాశాల అభివృద్ధిపై ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ, తాను ప్రిన్సిపాల్ (ఎఫ్ఎసి) గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి కళాశాలను అంచలంచెలుగా అభివృద్ధి చేయడానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కళాశాలలో నెలకొన్న సమస్యలు అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఓ దృష్టికి తీసుకెళ్లగా అనేక సమస్యలు పరిష్కరించారన్నారు ఇందులో భాగంగానే కళాశాల ప్రాంగణంలో మదర్స్ గార్డెన్ పేరుతో అన్ని రకాల 500 రోజ్ మొక్కలు నాటినట్లు ఆయన అన్నారు. కళాశాల చుట్టూ వంద రోజుల్లో 100 మొక్కల నాటే కార్యక్రమం విజయవంతంగా చేపట్టామని తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్వో ప్లాంట్ ను యూనియన్ బ్యాంకు సహకారంతో కలెక్టర్ మంజూరు చేశారని పేర్కొన్నారు. కోటి 25 లక్షల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతుందన్నారు. సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల కంప్యూటర్ ల్యాబ్ కూడా ప్రారంభించామన్నారు. కళాశాల ప్రాంగణం చుట్టూ మెడిసిన్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలన్నదే తమ సంకల్పమని ఆయన అన్నారు.

ప్రిన్సిపల్ చలపతిరావు

ఆర్‌ఓ ప్లాంట్ నీరు తాగుతున్న విద్యార్థినులు

నేరాలు ఘోరాలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని నీలకంఠాపురం వద్ద ఆదివారం తెల్లవారుజామున ఒక కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపడింది.ఎపి 31 ఏఆర్ 6345నెంబరు గల కారు అనకాపల్లి నుండి బుచ్చయ్యపేట వస్తుండగా ప్రమాదానికి గురైంది. విద్యుత్ స్తంభాని ఢీకొనడంతో స్తంభం మధ్యలో విరిగింది. ప్రమాదంలో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్డూరు గ్రామ మజ్జి గౌరమ్మ దేవాలయం పిక్నిక్ స్పాట్ వద్ద ఆదివారం ఎస్సై బి.జోగారావు నేతృత్వంలో పోలీసులు దాడి నిర్వహించారు. జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ. 63,080 నగదు, పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యపై అనుమానంతో కత్తితో శనివారం నాడు దాడి చేసిన భర్త దాడిబాబుపై మల్కాపురం పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మహిళలపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు హెచ్చరించారు.

క్యాండిల్ ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

ఎయిడ్స్ దినోత్సవ క్యాండిల్ ర్యాలీ

ప్రజాశక్తి -పాడేరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్, హెచ్.ఐ.వి, లెప్రసి అధికారి యం.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటిం చారు. ఈ కార్యక్రమంలో డి.యం.డి.ఓ. ఎస్ చిరంజీవి, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ కి రామచందర్, ఆరోగ్య విస్తరణ అధికారులు గుల్లేలి సింహాద్రి, కె సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా నేత రమణి

హింస వ్యతిరేక ఉద్యమంలో భాగమౌదాం

ప్రజాశక్తి-కూనవరం: పుట్టుకనుండి మరణం వరకు అన్ని దశల్లోనూ స్త్రీలపై హింసకు హద్దులు లేకుండా పోతున్నాయని, ఇంటా బయట మహిళలు ఎక్కడో ఒకచోట ఏదో ఒక రకమైన హింసకు, అకత్యాలకు, అవమానాలకు, హత్యలకు గురవుతున్నారని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి, జిల్లా అధ్యక్షురాలు ఎం శ్రీదేవి అన్నారు. స్త్రీల హక్కుల పరిరక్షణలో భాగంగా మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ, ' ఐక్యరాజ్య సమితి 'హింసా వ్యతిరేక దినంగా ప్రకటించిందన్నారు. ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో కూనవరం కెజిబివిలోలో నిర్వహించిన సదస్సులో ఐద్వా నేతలు మాట్లాడుతూ, ప్రపంచంలో ప్రతి ముగ్గురిలో ఒక మహిళ ఏదో ఒక రూపంలో లైంగిక హింసకు, ఒక మహిళ హత్యకు గురవుతున్నారన్నారు. 2021లో ప్రపంచంలో 45 వేలం మంది బాలికలు, తమ కుటుంబ సంబంధీకుల చేతుల్లోనే హత్య చేయబడ్డారన్నారు. ఇండియన్ నేషనల్ క్రైమ్ రిపోర్ట్ బ్యూరో 2023 నివేదికలో మహిళలపై జరుగుతున్న నేరాలు 2 లక్షలు నమోదయ్యాయని, ప్రతి గంటకు 51 ఫిర్యాదులు, సగటున ప్రతి 5 సెకండ్లకు ఒక నేరం జరుగుతుందన్నారు. వీటిలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తర్వాత స్థానాల్లో ఉన్నాయన్నారు. మహిళలు, బాలికల సాధికారిత, లింగ సమానత్వాన్ని 2030 నాటికి సాధించాలని మహిళాభివృద్ధి లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి నిర్ధేశించిందన్నారు. ఈ ఏడాది బాలికలపై, స్త్రీలపై జరుగుతున్న డిజిటల్ హింసను అరికట్టడం కోసం అందరం ఏకమవుదామనే నినాదాన్ని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందన్నారు. నవంబర్ 25 నుంచి నుండి డిసెంబర్ 10వ తేదీ మానవ హక్కుల దినం వరకు హింస వ్యతిరేక ఉద్యమాల్లో భాగస్వాములమౌదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ పద్మావతి, కారం లక్ష్మి, ఎం రమాదేవి, పి రత్తమ్మ, సుబ్బమ్మ, రాములమ్మ, ఎన్ అశ్విని, దారమ్మ, జీ కమల, సుధారాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

13న 'ఎవడి సినిమాకి వాడే హీరో' విడుదల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎవడి సినిమాకి వాడే హీరో టైటిల్‌తో విశాఖలో ఉత్తరాంధ్ర కళాకారులచే నిర్మించిన చిత్రం ఈ నెల 13న ప్రపంచ వ్యాప్తంగా వివిధ థియేటర్లలో విడుదల కానున్నట్టు చిత్ర నిర్మాణ ప్రముఖులు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్, నిర్మాత, దర్శకుడు పి.ఎ.భాస్కరరావు, ప్రొడ్యూసర్ దుగ్గివలస దివాకర్, సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి చిత్ర బృందంతో కలిసి ఆవిష్కరించారు. పైడా కృష్ణ ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విశాఖ వాసులకు దశాబ్దాలుగా పరిచయం ఉన్న పిఎ భాస్కరరావు సారథ్యంలో ఈ చిత్ర నిర్మాణం జరగడం, స్థానిక కళాకారులకు అందులో అవకాశం కల్పించడం అభినందనీయమని అన్నారు. సమావేశంలో నటీనటులు మల్లికా, జానీ మాస్టర్, బుజ్జి, వీరేష్, రచయితలు సనరా వంశీ, సత్తివాడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా మురళి వ్యవహరించారు.

10 వేల మందికి చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంఘ సేవకులు, జనసేన 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నేరెళ్ల కోనేరు జంక్షన్‌లో ఉన్న ఆయన నివాసం వద్ద కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 వేల మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. నాగరాజు దాతృత్వానికి మారుపేరుగా నిలిచారని ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ కొనియాడారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, కెఎన్ఆర్ ట్రస్ట్ డైరెక్టర్లు కందుల బద్రీనాథ్, కేదార్నాథ్, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మినీ వ్యాన్ బోల్తా : ఒకరు మృతి

13 మందికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

గండిపోచమ్మ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి-దేవీపట్నం: మండలంలోని అంగులూరు కాలనీ పరిధిలో ఆదివారం దుర్ఘటన చోటుచేసుకుంది. పాలకొల్లు మండలం దొడ్డుపట్ల గ్రామానికి చెందిన భక్తుల బృందం గండి పోచమ్మ దర్శనం చేసుకుని, తిరిగి వస్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న అశోక లేలాండ్ 302 మినీ వ్యాన్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం అంగులూరు పునరావాస కాలనీ కొండలోయ సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదంలో కాండ్రేకుల నరసింహస్వామి (39) అనే వ్యక్తి మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పోచమ్మ గండి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం సాగిస్తుండగా, వాహన డ్రైవర్ మద్యంమత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే వాహనం నియంత్రణ తప్పి రహదారికి పక్కన ఉన్న రాయిని ఢీకొని లోయలోనికి బోల్తా పడ్డట్లు సమాచారం. ప్రమాద శబ్దం విన్న స్థానికులు అక్కడికి చేరుకుని గాయపడిన వారిని బయటకు తీశారు. అనంతరం వారిని అంబులెన్స్‌లో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా,మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమహేంద్రవరం హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు సమాచారం ప్రమాదానికి క్షతగాత్రులు, ఇతర పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, వివరాలు సేకరిస్తున్నారు.

రోడ్డు పక్కన క్షతగాత్రులు

మానవతామూర్తి, భాషావేత్త గురజాడ

ఆయన పేరిట సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రముఖ రచయిత, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

గురజాడ వర్ధంతి సభలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని గొప్ప సందేశం ఇచ్చినటువంటి మానవతామూర్తి, ప్రజల భాష కోసం పోరాడినటువంటి గొప్ప భాషావేత్త గురజాడ అని ప్రముఖ రచయిత, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన సంఘ సంస్కర్త, మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సభ ఆదివారం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. దీనికి వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ తెలుగుజాతి మహా కవి గురజాడ అని కొనియాడారు. ఆయన 110వ వర్ధంతి కార్యక్రమాన్ని బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాల మధ్య నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. గురజాడను తలుచుకోవడం ప్రతి తెలుగు వ్యక్తి, సాహిత్య అభిమాని బాధ్యత అని తెలిపారు. గురజాడ తన సాహిత్యంతో సమాజ పోకడలను మార్చడానికి కృషి చేశారని గుర్తుచేశారు. 53వ ఏటనే మరణించినప్పటికీ 110 ఏళ్లుగా అతనిని తెలుగు ప్రజలు గుర్తుంచుకోవడం చాలా గొప్ప విషయమని, దానికి ఆయన సృష్టించినటువంటి సాహిత్యమే కారణమని అన్నారు. విజయనగరంలో గురజాడ నివసించినటువంటి గృహాన్ని ప్రభుత్వం స్వాధీన పరుచుకున్నప్పటికీ దాని నిర్వహణ సక్రమంగా లేదని అన్నారు. గురజాడ ఆలోచనలకు కేంద్రంగా దానిని ఒక మ్యూజియంగా మార్చాల్సిన అవసరముందన్నారు. గురజాడ పేరు మీద ఒక సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, దానికి ఉత్తరాంధ్రలో ఉన్నటువంటి కళా సాంస్కృతిక సంఘాలు, జానపద కళాకారుల సంఘాలన్నీ ఒక తాటిపైకి వచ్చి ప్రయత్నం చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన అధికారిక ఉత్సవాలలో గురజాడ వర్ధంతి, జయంతి లేకపోవడం శోచనీయమన్నారు.

అధికారిక ఉత్సవాల జాబితాలో చేర్చి ఆయనను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురజాడ వర్ధంతి సందర్భంగా పలు సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద నృత్య కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం బాధ్యులు విఎస్.పద్మనాభరాజు, విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు, ప్రముఖ రంగస్థల దర్శకులు బొట్టా వేణుగోపాలరావు, నాగా ఎడిటింగ్ స్టూడియో ఫౌండర్ నాగ చైతన్య, గురజాడ సాంస్కృతిక వేదిక అధ్యక్షులు పివి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరరెడ్డి దంపతులకు ఘన స్వాగతం పలుకుతున్న జెన్‌కో అధికారులు

చంద్రశేఖరరెడ్డికి ఘన సత్కారం

ప్రజాశక్తి -సీలేరు: ఉద్యోగ విరమణ చేసిన ఎపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) చంద్రశేఖర్‌రెడ్డి దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు చంద్రశేఖర్ రెడ్డి దంపతులను ఇంటి నుంచి సన్మాన సభ వేదిక వద్దకు దారిపొడుగునా పూలు చల్లుతూ, బాణసంచా పేలుళ్ల మధ్య స్వాగతించగా, ఎపి జెన్‌కో విద్యుత్ సౌధ చీఫ్ ఇంజనీరు సివిల్ రవీందర్‌రెడ్డి.ఎస్ఇ సివిల్ శ్రీనివాసరెడ్డి, ఇఇ సివిల్ రత్నకుమార్ దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సిఇ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పంపు స్టోరేజీ ప్రాజెక్టుకు ప్రారంభదశ నుంచి ప్రస్తుతం వరకు ముఖ్యంగా పర్యావరణ అనుమతులు రావటానిక చంద్రశేఖరరెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. పట్టుదల, ఏకాగ్రత, నిబద్ధత, క్రమశిక్షణతో విధులను నిర్వహించడమే కాకుండా తన పరిధిలోని వారితోనూ చేయించే వారన్నారు. ఎడిఎ అప్పలనాయుడు, సిహెచ్ సురేష్ మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధిలో సంస్థ నిర్దేశించిన ఏ పనినైనా నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసేవరకు తాను పనిచేయడంతోపాటు కిందస్థాయి ఉద్యోగులతో సైతం పనిచేయించే వరకు విశ్రమించే వారు కాదన్నారు. అటువంటి అధికారుల మార్గదర్శకంతో పనిచేయడం వల్లే ఎన్నో విషయాలను తెలుసుకోగలిగామన్నారు. సీలేరు అటవీశాఖ రేంజ్ అధికారి మాట్లాడుతూ తమ మాతృశాఖలోనే కాకుండా, విధి నిర్వహణలో ఇతర శాఖలకు అవసరమైన సలహాలు, సూచనలు చేస్తూ, అన్ని శాఖల సమన్వయం, పరస్పర సహకారంతో పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేశారన్నారు. చంద్రశేఖరరెడ్డికి ఎపి జెన్‌కోతోపాటు ఇతర శాఖలపైనా పూర్తి అవగాహన పట్టు ఉందన్నారు కార్యక్రమంలో ఎపి జెన్‌కో ఎస్ఇలు ఉమామహేశ్వరరావు, వీరభద్రరాజు, అరుణ్ కుమార్ అకౌంట్స్ ఆఫీసర్ ఇవివి సత్యనారాయణ, తెలంగాణ జెన్‌కో ఎస్ఇ రాంప్రసాద్, ఎపి జెన్‌కో విశ్రాంత ఎస్ఇ రమణమూర్తి, ఇఇ కావూరి శ్రీనివాసు, ఎడిఇ చలపతిరావు ఎస్ఐ యాసీను, సర్పంచ్ దుర్జో, ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, ఇంజనీర్లు కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో సంక్షోభంలో వ్యవసాయం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో రైతులు, రైతు కూలీల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందని, వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్లిందని శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం ఉదయం విశాఖ బీచ్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో సాగు రంగం తీవ్ర ఇబ్బందుల్లోకి వెళ్లిందన్నారు. ఒక్క పంటకూ ప్రభుత్వం కనీస గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. రైతులకు బస్తా యూరియా ఇవ్వలేని చేతకానితనంలో కూటమి ప్రభుత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ సంస్థలకు మాత్రం ఎకరా భూమిని రూ.1, రూ.100కే కేటాయిస్తూ దోపిడీకి పాల్పడుతోందని విమర్శించారు. గత ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చడం తప్ప ఈ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీలేదన్న ఆయన గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని మండిపడ్డారు. బోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ ఘనత ముమ్మాటికీ వైసిపిదేనన్నారు. వైఎస్ఆర్ హయాంలోనే ఎయిర్ పోర్టు ఆలోచనకు బీజం పడిందన్నారు. 2014-19 మధ్య కాలంలో కనీసం భూసేకరణ కూడా చంద్రబాబు చేయలేదని, జగన్ ప్రభుత్వ హయాంలోనే అన్ని అనుమతులతో విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభించామని స్పష్టం చేశారు. తాను చెప్పింది తప్పయితే తలదించుకుంటానని బొత్స సవాల్ విసిరారు. రాజ్యాంగ దినోత్సవం రోజున మండలి విపక్ష నేతకు సైతం ఆహ్వానం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచిందని ఆక్షేపించారు. మీడియా సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, శాసన మండలి సభ్యులు కుంభా రవిబాబు, మాజీ శాసన మండలి సభ్యులు సూర్యనారాయణ రాజు, పార్టీ నాయకులు మూగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.